అద్దెసరు ఆదాయం!

- ఆలయం ఘనం.. ఆదాయం అంతంతమాత్రం
- శ్రీ రామలింగేశ్వరుని ఆలయంలోని దుకాణాలకు ఈనెల 20న బహిరంగ వేలం
- ఆలయానికి దుకాణాల నుంచి వచ్చే అద్దెలే ఆదాయ వనరు
- మార్కెట్ ధరల ప్రకారం షాపుల అద్దెలు పెంచి ఆలయ ఆదాయం పెంచాలంటున్న భక్తులు


రామలింగేశ్వరుని ఆలయం బయట దుకాణ సముదాయం

అమరావతి: అమరావతి శ్రీ రామలింగేశ్వరుని ఆలయంలోని దుకాణాలకు ఈ సారైనా బహిరంగ వేలం నిర్వహించి స్వామివారి ఆదాయం పెంచాలని భక్తులు కోరుతున్నారు. గత 25 సంవత్సరాలుగా లీజు బహిరంగ వేలంలో జరిగిన పరిణామాలు గమనిస్తున్న భక్తులకు ఈసారైనా వేలం పాటలు జరుగుతాయా అని అనుమానాలు కలుగుతున్నాయి. ప్రతినెల దుకాణాల నుంచి దేవాలయానికి రావాల్సిన ఆదాయానికి కూడా గండి పడుతున్నట్లు దేవదాయశాఖ అధికారులు గుర్తించాలని భక్తులు కోరుతున్నారు.

నామమాత్రపు అద్దెలే..

దేవాలయ గత చరిత్రను పరిశీలిస్తే అమరావతిని పాలించిన రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు రామేశ్వరం యాత్రకు వెళ్లినపుడు అక్కడి నుంచి భక్తితో తీసుకుని వచ్చి అమరావతిలో రామలింగేశ్వరుని ప్రతిష్ఠించి 40సెంట్ల భూమిలో ఆలయ నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ఎటువంటి ఆదాయం లేని ఈ దేవాలయాన్ని కొన్నాళ్లు సదావర్తి సత్రం నిర్వాహకులతో పాటు దేవదాయశాఖ వారు నిర్వహణ చేశారు. ఈ నేపథ్యంలో గ్రామం అభివృద్ధి చెందటంతో ఆలయభూమి గ్రామం నడిబొడ్డులో ఉండి వ్యాపారాలకు అనుకూలంగా ఉండటంతో 1998వ సంవత్సరంలో ఆలయానికి సంబంధించిన మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న సుమారు 600 చదరపు గజాల స్థలాన్ని తాత్కాలికంగా దుకాణాలు నిర్మించుకుని వ్యాపారాలు నిర్వహించుకునేందుకు గజం రూ.7కు 34మంది లీజుదారులకు లీజుకు ఇవ్వటం జరిగింది. ఈ క్రమంలో 2009 సంవత్సరంలో లీజు కాలపరిమితి ముగియటంతో దేవదాయశాఖ అధికారులు బహిరంగ వేలాన్ని నామమాత్రంగా నిర్వహించి అప్పట్లో ఉన్న 34 దుకాణాలను వేలంపాట దారులకు ఇవ్వటం జరిగింది. అప్పట్లో కనీసం రూ.95 నుంచి అత్యధికంగా రూ.835ల వరకు ఈ దుకాణాలకు అద్దెలు చెల్లిస్తువచ్చారు మొత్తం 34 దుకాణాల ద్వారా మొత్తం నెలకు రూ.8వేలు పైగా ఆదాయం లభించేది.

2012లో దేవదాయశాఖ విచారణ

ఈ దుకాణాల సముదాయంపై భక్తుల నుంచి, గ్రామస్తుల నుంచి వచ్చిన ఎన్నో ఫిర్యాదుల మేరకు దేవదాయశాఖ అధికారులు 2012 జూలై 20వ తేదీన అనాటి దేవదాయశాఖ ఇన్స్పెక్టర్ సిహెచ్ శివప్రసాదరావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈవిచారణలో సబ్‌లీజుకు ఇచ్చి లీజుదారులు అధిక ఆదాయాన్ని పొందుతూ నియమాలను అతిక్రమించినట్లు, ఈకాంప్లెక్స్‌కు సమీపంలో ఉన్న దుకాణాలకు వేల రూపాయలు అద్దెలు ఉన్నట్లు దేవదాయశాఖ అధికారుల గుర్తించి దేవాలయం ఆదాయం పెరగటానికి బహిరంగవేలం నిర్వహించాలని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఆనాటి రాజకీయ ఒత్తిళ్ల మేరకు కొంతమేర అద్దెలు పెంచి వేలం నిర్వహించి మమ అనిపించారు.

20న బహిరంగ వేలంకు ఏర్పాట్లు

ఇటీవల గ్రామ పంచాయతీకి చెందిన దుకాణ సముదాయానికి బహిరంగ వేలం పాటలు నిర్వహించగా మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న దుకాణాలు అద్దె రూ.15 వేల నుంచి 20వేల వరకు పాడుకున్న నేపథ్యంలో మళ్లీ రామలింగేశ్వర దేవాలయం దుకాణ సముదాయం అద్దెలపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో ప్రస్తుతం ఈనెల 20వ తేదీ ప్రస్తుతమున్న 33దుకాణాలకు షాపుల లీజు హక్కుల బహిరంగవేలం నిర్వహించటానికి దేవదాయ అధికారులు నిర్ణయించారు. గత లీజుదారులు ఈ బహిరంగవేలం నిలిపివేయటానికి అన్నిరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. లీజు పరిమితి ముగిసిన ఈ దుకాణాలకు బహిరంగ వేలం పాటలు నిష్పక్షపాతంగా నిర్వహించి దేవాలయ ఆదాయాన్ని పెంచాలని భక్తులు కోరుతున్నారు.

ఆదాయం పెరగాలి.. పూర్వ వైభవం రావాలి



దేవాలయానికి ఆదాయం పెరిగి రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కాలంలో లాగా పూర్వవైభవం రావాలి. దేవదాయశాఖ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా దేవదాయ చట్టానికి లోబడి వేలం నిర్వహించాలి. మార్కెట్‌లో ఉన్న అద్దెలతో పోల్చుకుని దేవాలయానికి ఆదాయం పెరగాలని భక్తులందరి కోరిక.

– నేరెళ్ల హనుమంతరావు, అమరేశ్వరస్వామి దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు మెంబర్

నియమ నిబంధనలకు లోబడి..

దేవస్థానానికి తూర్పు, ఉత్తరాన ఉన్న 33షాపులకు ఈనెల 20వ తేదీన బహిరంగవేలం నిర్వహించటానికి ఉన్నతాధికారులు ఆదేశాలతో అన్ని ఏర్పాట్లు చేశాం. గతంలో కేవలం స్థలం మాత్రమే వ్యాపారం చేసుకునేందుకు లీజుకు ఇచ్చాం. ప్రస్తుతం దేవాలయ ఆవరణలో వివిధ కొలతలతో ఉన్న అండర్ గ్రౌండ్ షాపులతో కలిపి 33షాపులకు మూడు సంవత్సరాల కాలపరిమితిలో బహిరంగవేలం నిర్వహిస్తున్నాం. దేవదాయ శాఖ చట్టంకు లోబడి అన్ని నియమ నిబంధనలతో వేలం నిర్వహిస్తాం

–ఆర్.సూర్యనారాయణ, ఈఓ, శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం, అమరావతి

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక వేడుకలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం తదితర పూజాధికాలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి శాంతికల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై అవగాహన



క్రోసూరు: స్థానిక లూథరన్ చర్చి ఆవరణలో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు క్రోసూరు మండల గుడ్ షెఫర్డ్ ఇన్‌చార్జ్ టి.లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. క్రోసూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. ఫలితంగా సమాజంలో మంచి నాయకులుగా ఎదిగి, సమాజాభివృద్ధికి కృషి చేస్తారన్నారు. నిజాయితీగా స్వార్థం లేకుండా అందరినీ కలుపుకొని ముందుకు నడిపించినవాడు మంచి నాయకుడు అన్నారు. గుడ్ షెఫర్డ్ సంస్థ కో–ఆర్డినేటర్ సిస్టర్ యాంటో మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌరులుగా మారి నూతన సమాజాన్ని నిర్మించాలన్నారు. ఆర్ఐ వెంకట్రావు, సంస్థ సిబ్బంది బత్తుల బాబు, పవన్ కుమార్, అందుకూరు బాలమర్తి, క్రోసూరు గ్రామాల బాలల పార్లమెంటు లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయ భూములకు కౌలు వేలం

నకరికల్లు: స్థానిక శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ భూములకు కౌలువేలం ఈనెల 13వ తేదీన నరసరావుపేటలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వై.వెంకయ్య బుధవారం తెలిపారు. నకరికల్లులోని సర్వేనంబర్ 49లో గల 3.15 ఎకరాలకు కౌలువేలం నిర్వహిస్తామన్నారు. రెండేళ్లపాటు కౌలుకోసం నిర్వహించే వేలంలో పాల్గొన లచిన ఈనెల 13వ తేదీన ఉదయం 10 గంటలకల్లా నరసరావుపేట పట్టణంలోని శివుని బొమ్మ సెంటర్ ఎదురుగా గల అంకమ్మతల్లి దేవస్థానంలోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కుట్టుమిషన్ పంపిణీ



అచ్చంపేట: జీవనోపాధి లేక కుటుంబం గడవడం భారమైన ఓ నిరుపేద టైలర్‌కు స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆసరాగా నిలబడింది. అచ్చంపేటకు చెందిన షేక్ బాబు అనే టైలర్‌కు రూ.10వేలు విలువచేసే కుట్టుమిషన్‌ను ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయ్ చేతులమీదుగా బుధవారం స్నేహహస్తాలు ఫౌండేషన్ వారు కుట్టుమిషన్ అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్వర్ణమ్మబాయ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ నిరుపేదలకు సేవలను అందచేస్తున్న స్నేహహస్తాలు ఫౌండేషన్ వారు అభినందనీయులన్నారు. స్నేహహస్తాలు ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరిముల్లాబాబు, తుమ్మా శౌరైడ్డి, మన్నెం భద్రయగ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

సత్తెనపల్లి: రోడ్లు శుభ్రం చేసే క్రమంలో అంచుల్లో పేరుకుపోయిన మట్టిని సైతం తొలగించి శుభ్రపరచాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ అన్నారు. పట్నంలో మున్సిపల్ కార్మికులు చేపడుతున్న వీధుల శుభ్రతను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులకు పలు సూచనలు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, సిబ్బంది ఉన్నారు.

మండల అభివృద్ధికి సమష్టి కృషి

రాజుపాలెం: నాయకులు సమష్టిగా మండల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ముందు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గణపవరం ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్.దుర్గేష్‌రావు, ఎంఈవో మల్లిఖార్జునశర్మ, మాజీ జెడ్పీటీసీ మర్రి వెంకటరామిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పల్లపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి
- టీడీపీ నేతల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త శ్రీహరికి పరామర్శ


క్షతగాత్రుడు రాంపాటి శ్రీహరితో మాట్లాడుతున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. రాజుపాలెం మండలం కొత్త బోధనం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రాంపాటి శ్రీహరి సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నాడనే ఉద్దేశంతో పథకం ప్రకారం టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరచిన ఘటన విధితమే. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రాంపాటి శ్రీహరిని బుధవారం డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి పరామర్శించి, భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఎస్సార్ సీపీకి చెందిన వారికి ఎలాంటి పనులు చేయొద్దని తెలియజేశారని, దీనిని ఖండిస్తూ వీడియో చేసినందుకు రాంపాటి శ్రీహరిపై టీడీపీకి చెందిన తోట ఆంజనేయులు, తోట నరసింహ స్వామి, వేల్పుల నరసింహారావులు పథకం ప్రకారం దాడి చేసి గాయ పరిచారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా క్షతగాత్రుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ రాజుపాలెం మండల అధ్యక్షుడు వేపూరి శ్రీనివాసరావు, జడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, బండి కోటినాగిరెడ్డి, వట్టే శివారెడ్డి, కుంభా వెంకయ్య, రెడ్డిగూడెం బాషా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు అచ్యుత శివప్రసాద్, సయ్యద్ ఖాజా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

సత్తెనపల్లి: విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన కురివెళ్ల సాంబశివరావు, శివపార్వతి దంపతుల కుమారుడు కురివెళ్ల హర్షిత్ ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్‌లో 352 ర్యాంకు సాధించాడు. బుధవారం హర్షిత్‌ను భార్గవ్‌రెడ్డి అభినందించి పూల మాలలు, దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడితే భవిష్యత్తు అంతా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు తదితరులు ఉన్నారు.

ఒత్తిడి రహిత జీవితానికి యోగా దోహదం

ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న శిఖా శ్యాంసన్, మాబుల, సాంబశివరావు, ఆరోగ్య కార్యకర్తలు

క్రోసూరు: మండలంలోని ఊటుకూరులో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ ఆధ్వర్యంలో బుధవారం యోగాపై అవగాహన ప్రదర్శన, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శిఖా శ్యాంసన్ మాట్లాడుతూ ఈనెల 21న విశాఖపట్నంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరగనున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ తరపున మండలంలో జూన్ 21 వరకు ప్రతిరోజు యోగాపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నామన్నారు. ఒత్తిడి రహిత జీవితానికి యోగ ఉపయోగపడుతుందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు యోగాపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగా వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాబుల వివరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివరావు, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం



రెంటచింతల: మండలంలోని పలనాటి కోనసీమగా పేరు పొందిన మంచికల్లులో పోలేరమ్మ దేవస్థానం వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం ప్రధాన అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు బుధవారం తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతం, పంచామృతాభిషేకం, వివిధ రకాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల వార్షికోత్సవ వేడుకలలో పాల్గొనే భక్తులకు మహాన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ విగ్రహంతో మేళతాళాలతో గ్రామోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వేడుకలలో పాల్గొని అమ్మవారి చల్లని దీవెనలు పొందాలని ఆయన కోరారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో అందంగా ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సీతారామయ్య

శావల్యాపురం: ఉపాధి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టింట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో పంట సంజీవని నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఎరువు గుంతలు నూరు శాతం పనులు ఈనెలాఖారుకు పూర్తి అయ్యేలా క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్స్ పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. పంట కాల్వలు, పూడికతీత పనులు, తదితర పనులన్నీ పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు త్వరలో వారి బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఏపీవో కె.రామారావు ఉన్నారు

రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టులో న్యాయ విజ్ఞాన సదస్సు


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయాధికారి ఆశీర్వాదం పాల్

నరసరావుపేట టౌన్: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు బుధవారం స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రామిరెడ్డిపేటలో గల రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆశీర్వాదం పాల్ ఆశ్రమంలో ఉన్న వృద్ధ మహిళల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవలసినదిగా ఆమె కోరారు. అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ కార్యదర్శి శ్రీరామినేని ప్రసాద్, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, మొదటి పట్టణ పోలీసులు, ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ


చేనేతకాలనీలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న కాశీ మల్లేశ్వరరావు, తదితరులు

సత్తెనపల్లి: ఎన్ఆర్ఐ గుండవరపు అనిల్ కుమార్ సేవలు వెలకట్టలేనివని గోశాల అధ్యక్షుడు పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లి పట్టణంలో వంగర బ్రహ్మయ్య, గంజి వీరాస్వామి ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అమరావతి మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన గుండవరపు వెంకట్రావు జ్ఞాపకార్థం వీరి కుమారుడు ఎన్ఆర్ఐ గుండవరపు అనిల్ కుమార్ ధర్మపత్ని జయశ్రీ ఆర్థిక సహాయంతో బుధవారం 30 మంది నిరుపేదలకు, వృద్ధులకు నిత్యావసర సరుకులు, మామిడి పళ్లు పంపిణీ చేశారు. అంతేకాకుండా సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ పథకంలో 140 మందికి ఉచితంగా అన్నసంతర్పణ నిర్వహించారు. స్థానికులు కట్టా శివ దుర్గారావు, దివ్వెల శ్రీనివాసరావు, గంగూరు కళ్యాణ్, గంగూరి విద్య, అప్పాపురపు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బొల్లవరంలో ఏరువాక



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని వ్యవసాయ పనులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని శ్రీసీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న పొలంలో పూజలు చేసి ట్రాక్టర్ నడిపి, అరకతో వ్యవసాయ పనులకు భూమిపూజ చేశారు. మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: అన్నదాతలకు సంబంధించిన అతి పెద్ద పండుగ ఏరువాక అని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 28వ వార్డు అచ్చంపేట రోడ్డు నందు గల వినాయకుడి గుడిలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు

చిలకలూరిపేట: నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవని మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కేఎల్ రావు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రవాణా, పోలీసు, ఆర్టీసీ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ వాహన తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మొత్తం 45 వాహనాలను తనిఖీ చేసి 12 వాహనాలపై ఇన్సూరెన్స్ లేకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకపోవడం వంటి పలు కారణాలతో కేసులు నమోదు చేశారు. వీరిపై రూ. 49,480 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ రాంబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్‌కు గాయాలు



నాదెండ్ల: వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన కాలువలో బోల్తా పడిన సంఘటన గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో బుల్లెమ్మబావి వద్ద బుధవారం చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామ రైతు గోపు రామారావుకు చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ సుబ్బారావు మంగళవారం రాత్రి వ్యవసాయ పనుల నిమిత్తం రోటవేటర్‌తో తీసుకెళ్లాడు. ఉదయం పొలం నుంచి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో బోల్తాపడింది. క్రేన్ సాయంతో బోల్తాపడిన ట్రాక్టర్‌ను వెలికితీశారు. డ్రైవర్ సుబ్బారావుకు స్వల్ప గాయాలు కాగా ట్రాక్టర్ దెబ్బతింది.

గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం

బెల్లంకొండ: రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బైరాపట్నం రామకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం, రామాంజనేయపురం గ్రామాలలో సీపీఐ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి పేద, బడుగు, బలహీన వర్గాల, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని మండిపడ్డారు. యువతకు రెండు కోట్ల ఉద్యోగాల అవకాశాలు కల్పిస్తామని నిరుద్యోగ యువతను మోసం చేశారని తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్పులు చేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఎన్నికల ముందు రైతుల సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన తర్వాత రైతులను నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని మండిపడ్డారు. మండల కార్యదర్శి పి.వెంకట్రావు, నాయకులు కరీముల్లా, రామాంజనేయ పురం శ్రీనివాసరావు, కుంభ వెంకట్రావు, గోపి, రాజేష్, రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు



బొల్లాపల్లి: నాటుసారా తయారుచేసినా, విక్రయాలు జరిపినా కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు డి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈపూరు ఎక్సైజ్ స్టేషనుపరిధిలోని ఈపూరు, బొల్లాపల్లి మండలాలల్లో పలుగ్రామాలల్లో తనిఖీలు నిర్వహించారు. నవోదయ 2.0 నాటుసారా నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా తనిఖీలు, అనుమానం ఉన్నచోట్ల సోదాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైయినా నాటుసారాతయారీ జరిగితే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీసులకు ప్రజలు సహకరిస్తే నాటుసారా నిర్మూలన సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ పై కళాజాత



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో అసిస్ట్–ఐటీసీ సంస్థల సౌజన్యంతో స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై కళాజాతర మేలుకొలుపు బృందం సభ్యులు పాటల ద్వారా అవగాహన బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా కళాజాతర టీం సభ్యులు మరుగుదొడ్ల వినియోగం, బాల్య వివాహాలు చేయటం వలన జరుగే అనర్థాలు, తడి–పొడి చెత్త లాంటి వ్యర్థాలను సక్రమంగా గ్రామంలో శానిటేషన్ కార్మికులకు అందించడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పాటల రూపంలో అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ కమ్యూనిటీ ఆర్గనేజరు కొండ్రు ఏసోబు, సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, కళాజాతర టీం సభ్యులు వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష


లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహిస్తున్న న్యాయమూర్తి ఎస్. లావణ్య

నరసరావుపేట టౌన్: పట్టణంలోని న్యాయస్థానం ఆవరణలో జులై 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై బుధవారం సమావేశం నిర్వహించారు. అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.లావణ్య మాట్లాడుతూ సివిల్, రాజీ పడదగిన క్రిమినల్, ఎన్ ఐ యాక్ట్ కేసులు, ఎంవివో పి, బ్యాంక్, చిట్‌ఫండ్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి సహకరించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు గన్నే వేంకట సుబ్బారావు, పలువురు న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.